క్లుప్తంగా

అభివృద్ధి పనులు ప్రారంభం



జీడీ నెల్లూరులో శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలో అన్న క్యాంటీన్ భవనం శంకుస్థాపన , నెల్లేపల్లిలో పలు అభివృద్ధి పనులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, స్థానిక ఎమ్మెల్యే థామస్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

15న సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం

నింద్ర: మండలంలోని ఉపాధి పథకం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం 15వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ తెలిపారు. 18వ విడత సామాజిక తనిఖీ సమావేశం, ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకంలో గ్రామాల్లో జరిగిన వివిధ రకాల పనులపై తనిఖీ బృందం చేసిన తనిఖీల నివేదికను సమావేశంలో చదివి, వినిపిస్తామని తెలిపారు.

వైఎస్ఆర్ సీపీ నియామకాలు

నింద్ర: వైఎస్ఆర్ సీపీ చిత్తూరు జిల్లా అనుబంధ విభాగాల్లో నింద్ర మండలానికి చెందిన నాయకులకు జిల్లా స్థాయిలో స్థానం కల్పిస్తూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బీసీ సెల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా పరంధామ యాదవ్, ఇరుగువాయి, గ్రీవెన్స్ సెల్ జనరల్ కార్యదర్శిగా దశరథ నాయుడు, ప్రచార జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామచంద్రారెడ్డి, బూత్ కమి టీ కార్యదర్శిగా మురళీకృష్ణనాయుడు, ప్రచార కార్యదర్శిగా బాబురెడ్డి, ఎంప్లాయిస్ విభాగం కార్యదర్శిగా సింగారం, ఆర్‌టీఐ మెంబర్ దాము, రైతు విభాగం మెంబర్‌గా మధురాజు, జీ.ఎన్ కండ్రిగ, యవజన విభాగం మెంబర్‌గా సూర్య, గ్రీవెన్స్ సెల్ మెంబర్‌గా శెల్వంరెడ్డి యమితులయ్యారు.

సమస్యలు తెలుసుకోవాలి

చిత్తూరు కార్పొరేషన్: క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది ఎక్కువగా తిరగాలని ట్రాన్స్‌కో డైరెక్టర్ గురవయ్య ఆదేశించారు. శనివారం మిట్టూరు సబ్‌స్టేషన్‌ను పరిశీలించి మాట్లాడారు.

నిమ్మ సాగు.. లాభాలు బాగు



రైతులు సాగు చేస్తున్న నిమ్మతోటలకు ప్రధాన వ్యాధి మంగు సోకిందంటే అన్నదాతకు తీవ్ర నష్టమే. సూక్ష్మధాతు లోపం కూడా నిమ్మ పంటను బాగా వేధిస్తుంటుంది. అధికారుల మాటల్లో చెప్పాలంటే దేశంలో ఎక్కడా సూక్ష్మధాతు లోపం లేకుండా నిమ్మ తోటలు లేవు. మంగు, సూక్ష్మధాతు లోపం.. ఈ రెండు సమస్యల నుంచి తోటను కాపాడగలిగితే ఆ రైతులు తన కష్టానికి తగిన ప్రతి ఫలాన్ని ఇంట్లో ఉంచుకున్నట్లే. నిమ్మ రైతు శ్రేయస్సు కోసం, రైతు సమస్యలను తరిమేయడం కోసం నిమ్మలో ప్రధాన సమస్యలైన మంగు, సూక్ష్మధాతులోపాల నుంచి గట్టెక్కే విధానాలపై వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ ఆయన మాటల్లోనే వివరించారు.

– పాలసముద్రం

- రెండు సమస్యలు అధిగమిస్తే అధిక దిగుబడులు

మండలంలో దాదాపు 20 ఎకరాల్లో ప్రస్తుతం నిమ్మ పంట కాపు దశలో ఉంది. ఇప్పుడు కూడా నిమ్మ సాగు మొదలుపెట్టవచ్చు. కంద, అరటి, పసుపు పొలాల్లో కొత్తగా సాగు చేసుకుంటే సమయం కలిసి వస్తుంది. ప్రస్తుతం కాయ దశలో ఉన్న నిమ్మలో మంగు, సూక్ష్మధాతు లోపాల సమస్యలు ఎక్కువగా ఉన్నాయి.

అసలు మంగు అంటే..

నిమ్మలో ప్రధాన సమస్య మంగు. ఇది నల్లి పురుగు వల్ల వస్తుంది. మొక్కలు ఎదుగుదల లోపించడం, కాయ నాణ్యత దెబ్బ తినడం, నల్ల మచ్చ ఏర్పడడం మంగు లక్షణం. నల్లి పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే పైరు 40 శాతం వరకు దిగుబడి దెబ్బ తినే అత్యంత ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. మంగు సోకిందంటే కాయలపై నల్లటి మచ్చలు ఏర్పడుతాయి. మంగు సోకిన చోట ఎండ తగిలితే రసాయన చర్య జరిగి కాయ కుళ్లిపోతుంది. నల్లటి మచ్చలు ఏర్పడుతాయి. మార్కెట్‌లో నిమ్మ కాయలు కొనుగోలు చేయరు. ధరలు తగ్గిపోతాయి. దిగుబడులు పూర్తిగా పడిపోతాయి.

మంగు సమస్య నివారణ

- నల్లిని పూర్తిగా నిర్మూలిస్తేనే మంగు సమస్య నుంచి రైతులు బయటపడతారు.
- మంగుపై రైతుల్లో అనేక అపోహలున్నాయి.
- పురుగు మందు కొడితే మంగు పెరుగుతుందనే అభిప్రాయం తప్పు.
- మంగు నివారణకు మందులు పిచికారీ చేస్తే నల్లి చావదని. పైగా మంగు పెరిగిపోతుందని రైతుల్లో భయం ఉంది. దీని నుంచి బయటకు రావాలి.
- 2 ఎంఎల్ పైరోమైట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే నల్లి నుంచి పంటను కాపాడవచ్చు.
- బ్లాక్, బ్రౌన్ సల్ఫర్‌లో ఏదో ఒకటి లీటరు నీటిలో 2 గ్రాములు కలిపి పిచికారీ చేస్తే నల్లిని నివారించుకోవచ్చు. అయితే తోటలో పూత మీద ఉన్నప్పుడు సల్ఫర్ పిచికారీ చేయకూడదు. కాయ మీద ఉన్నప్పుడే పిచికారీ చేసుకోవాలి. అందుకే పైరోమైట్ పిచికారీ చేయడమే శ్రేయస్కరం.

సూక్ష్మధాతు లోపం

- మొక్కలను నాటాక ప్రతి రెండు నెలలకు చిగుర్లు వచ్చేటప్పుడు సూక్ష్మధాతు మిశ్రమంలో ఆగ్రోమిన్‌మాక్స్, రోగార్, క్లోరిపైరిఫాస్‌లో ఏదో ఒక దానిని కలిపి పిచికారీ చేయాలి. దీనివల్ల పురుగులు పంటను తింటాయనే భయం ఉండదు. మొక్కల పెరుగుదల కూడా బాగుంటుంది.
- ప్రతి ఆరు నెలలకు ఒకసారి పశువులు, రసాయన ఎరువులను పంటకు తప్పనిసరిగా వేయాలి.ప్రతి ఆరు నెలలకు ఎకరా పొలంలో 800 గ్రాముల యూరియా, 1200 గ్రాముల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 500 గ్రాముల పొటాష్, 3 కిలోల వేపపిండి లేదా అముదం చెక్క, 50 కిలోల పశువుల ఎరువు తప్పనిసరిగా అందించాలి.
- ఒక్కో మొక్కకు 150 గ్రాముల పశువుల ఎరువులో ఫార్ములా 7ను కలిపి ప్రతి ఏడాది అందించాలి. దీనివల్ల సూక్ష్మధాతు లోపం కనిపించదు.
- సూక్ష్మధాతు లోపం కనిపిస్తే 3 గ్రాముల ఆగ్రోమిన్ మ్యాక్స్‌ను లీటరు నీటిలో కలిపి వారంలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేసుకోవాలి.



ఢిల్లీప్రసాద్, వ్యవసాయాధికారి

ఇవి కూడా కీలక మెళకువలే..

- సూక్ష్మధాతు లోపం, నల్లి పురుగులు లేని బలమైన మొక్కలను రైతులు ఎంచుకోవాలి.
- ఎటుచూపినా ఆరు మీటర్ల దూరం ఉండేలా మొక్కలు నాటాలి.
- డ్రిప్ పద్ధతిలో సాగు చేపడితే కలుపు సమస్యను అధిగమించవచ్చు. మొక్కలు బాగా పెరుగుతాయి.
- డ్రిప్ పద్ధతి ద్వారా వేరుకుళ్లు నివారించుకోవచ్చు. పంటలో వేరుకుళ్లు కనిపిస్తే జ్ఞానోడెర్మాను పిచికారీ చేసుకోవాలి.

వైఎస్ఆర్ సీపీ నాయకుడి ఆకస్మిక మృతి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమారస్వామి రెడ్డి

నగరి: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల మాజీ కన్వీనర్ సుదర్శన్ నాయుడు శనివారం ఉదయం చెన్నైలో అస్వస్థతకులోనై మృతిచెందారు. సాయంత్రం స్వగ్రామం నగరి మండలం మేళపట్టు గ్రామానికి భౌతిక కాయాన్ని తీసుకువచ్చారు. మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమారస్వామిరెడ్డి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఢిల్లీబాబు, బుజ్జిరెడ్డి, ముడిపల్లి సర్పంచ్, జిల్లా ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శి ప్రకాష్, మేళపట్టు సర్పంచ్ ప్రకాష్, జిల్లా పార్టీ అడ్వయిజర్ లీలారామ్, ఎంపీటీసీ యేసు, దామునాయుడు, ఆషీమ్, దేవ మందడి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం రేపు

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ శనివారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కంటి జబ్బు రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య

పుత్తూరు: అత్తతో పాటు కట్టుకున్న భర్త సైతం తిట్టాడన్న క్షణికావేశంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకొన్న సంఘటన శనివారం పుత్తూరు పట్టణంలో చోటుచేసుకొంది. సీఐ సురేంద్రనాయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పుత్తూరు పట్టణంలోని పిళ్లారిపట్టు రోడ్డులో ఉంటున్న డేనియల్(30)కు షోళింగర్‌కు చెందిన స్నేహ(22)తో రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడాది వయస్సు కలిగిన పాప ఉంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 11 గంటల సమయంలో స్నేహను ఆమె అత్త శాంతి పిండి మిషన్‌ను శుభ్రం చేయలేదని తిట్టింది. దీంతో కోపగించుకున్న స్నేహ అప్పుడే ఇంట్లోకి వచ్చిన భర్త చేతిలోని టమాటాల కవర్‌ను తీసి విసిరి కొట్టింది. దీనికి ఆగ్రహించిన డేనియల్ సైతం స్నేహను తిట్టడంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకొంది. కొద్ది సేపటి తర్వాత డేనియల్ తలుపు తీయడానికి ప్రయత్నించగా లోపల గడియ పెట్టి ఉండడంతో కిటికీలో నుంచి చూడగా స్నేహా ఉరి వేసుకొని కనిపించింది. వెంటనే తలుపులు విరగగొట్టి లోపలి కెళ్లి హుటాహుటిన స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతిలోని అమర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం 4 గంటలకు స్నేహ మృతి చెందింది. మృతురాలి తల్లి పరిమళ శనివారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పలాయగుంటలో పుష్పయాగం



పుష్పయాగం

వడమాలపేట (విజయపురం): అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పుష్పయాగం వైభవంగా జరిగింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉభయదేవేరుల సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామివారికి స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పుష్పయాగం కోసం వినియోగించే పుష్పాలను ఆలయంలో మూలమూర్తి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత ఆలయ ప్రదక్షిణగా వెళ్లి మాడ వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 గంటల వరకు అర్చకుల వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పయాగం వైభవంగా జరిగింది. 12 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో పుష్పయాగం నిర్వహించారు. ఒక టన్ను పుష్పాలను ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి టీటీడీ సరఫరా చేసింది. అనంతరం వీధి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ మోసగాడు చంద్రబాబు



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఇన్‌చార్జి కృపాలక్ష్మి



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ఎన్నికల హామీలకు లేదు ష్యూరిటీ...
- నయవంచన, మోసాలకు ఆద్యుడు బాబు
- మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి
- రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ

వెదురుకుప్పం: ఎన్నికల్లో చంద్రబాబు ప్రజలకు చేసిన వాగ్దానాలు అధికారంలోకి వచ్చాక ఒక్కటంటే ఒక్కటీ అమలు చేయకుండా ఏడాది గడుస్తున్నా ప్రశ్నించిన వారి గొంతునొక్కుతూ అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తూ వంచిస్తున్నాడని మాజీ ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి ధ్వజమెత్తారు. శనివారం మండలంలోని జీటీ కండ్రిగ వద్ద ఉన్న పీఆర్సీ కన్వెన్షన్ హాల్‌లో రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో, బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నట్లు చెప్పారు. దీపం పథకం కింద ఏడాది మూడు సిలిండర్లు ఇస్తానన్న బాబు ఎంత మంది మహిళలకు ఇస్తున్నారో తెలియడం లేదన్నారు. వైఎస్ఆర్ సీపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 80 శాతం హామీలను అమలు చేసి చూపించారన్నారు. ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు బాండ్లు పంచారని, హామీలు అమలు చేయకపోతే కాలర్ పట్టుకొని అడగాలని చందబాబు కుమారుడు లోకేష్ చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు గ్రామాల్లోకి వెళ్తే అన్ని వర్గాల వారు కూటమి ప్రజాప్రతినిధుల కాలర్ పట్టుకోవడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రామయ్య, బూత్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్‌రెడ్డి, వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్, మండల ఉపాధ్యక్షుడు గోవిందన్, కార్యదర్శి బొజ్జారెడ్డి, ఎంపీటీసీలు గుణశేఖర్, చిన్నబ్బ, భాస్కర్, యువత అధ్యక్షుడు గణపతిరెడ్డి, మాజీ యువత అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, వైద్య విభాగం అధ్యక్షుడు జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు పురుషోత్తం, జ్ఞానమ్మ, మాజీ ఎంపీటీసీలు ధనుంజయరెడ్డి, రోశిరెడ్డి, సర్పంచ్ గోవిందయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నాగరాజు, నాయకులు పురంధర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు తోడుగా ఉంటాం



వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలకు అన్నివిధాలుగా తోడుగా ఉంటాం. ఎవరు ఎన్ని కేసులు పెట్టినా బెదిరేది లేదు. నవరత్నాలు పథకం ద్వారా జగనన్న సంక్షేమ పథకాలు అందిస్తే చంద్రబాబు సూపర్‌సిక్స్ అంటూ ప్రజలను దారుణంగా మోసం చేశారు. వైఎస్ఆర్ సీపీ జెండా ఎత్తిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. జగనన్న కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి కూటమి అరాచకాలను ఎండగట్టాలి. రోజూ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, బాలికల మిస్సింగ్‌పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నోరు మెదపడం లేదు.

- కె.కృపాలక్ష్మి, జీడీ నెల్లూరు సమన్వయకర్త

మోసాలను ఎండగడదాం...



చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలి. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ విధంగా అమలు చేశారు... చంద్రబాబు ఏ విధంగా ప్రజలను వంచిస్తున్నారో వివరించాలి. ప్రతి ఒక్కరూ గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు జరుగుతున్న మోసపాలు, అన్యాయాలను ఎండగట్టాలి. కూటమి ప్రభుత్వం చేస్తున్న దురాగతాలను ప్రజలకు వివరించాలి. పథకాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి.

- పద్మనాభరెడ్డి, వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు, వెదురుకుప్పం

కూటమి రైతుల కడుపు కొడుతోంది



కూటమి ప్రభుత్వం మామిడి రైతుల కడుపు కొడుతోంది. కనీస మద్దతు ధర కల్పించకపోవడంతో రైతులు రోడ్డున పడుతున్నారు. మామిడి లోడ్లు తీసుకెళితే వారం రోజులుగా ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు కాస్తున్నారు. చివరికి లోడ్లులను తిప్పి పంపుతున్నారు. సకాలంలో రైతులకు అందాల్సిన విత్తనాలు, సేవలను ఇవ్వడం లేదు. గతంలో రైతులను అన్ని విధాలుగా ఆదుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఇలాంటి దుర్మార్గపు ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదు.

- ఉమాచంద్రారెడ్డి, రైతు నాయకుడు

ఆది నుంచీ మోసాలే...



ఆది నుంచీ ప్రజలను అన్ని విధాలుగా మోసం చేయడం చంద్రబాబు నైజం. చెప్పిన వాగ్దానాలను ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను హింసించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఏ ఎన్నికల్లోనూ నిజాయితీగా పోటీ చేసి గెలవలేదు. ఒంటరిగా పోటీ చేసి, గెలిచిన పాపాన పోలేదు. ఆయన చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అందరూ సంఘటితం కావాలి. కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాలి.

- రాధిక, మహిళా అధ్యక్షురాలు, గంగాధరనెల్లూరు

బెదిరింపులకు భయపడేది లేదు



కూటమి ప్రభుత్వం చేస్తున్న దురాగతాలకు బెదిరేది లేదు. జనం జగనన్న వెంట ఉన్నారు. ఎన్ని కుట్రలు చేసినా ఎన్ని కేసులు బనాయించినా వైఎస్ఆర్ సీపీ కార్యకర్తగా ఎవ్వరూ భయపడరు. అరచేతిని అడ్డు పెట్టి జగనన్న ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరు. ఏడాదిలోపే కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వచ్చింది. గ్రామాల్లో తిరుగుబాటు మొదలైంది. మోసాలపై నిలదీసే సమయం ఆసన్నమైంది.

- సుకుమార్, జెడ్పీటీసీ, వెదురుకుప్పం

అరాచకాలు అధికమయ్యాయి



మండలంలో టీడీపీ నాయకుల అరాచకాలు అధికమయ్యాయి. వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలను తిరుపతి జిల్లాలో చేర్చుతామన్ని నాయకులు ఇప్పుడు చేర్చలేదు. పచ్చికాపల్లం-కార్వేటినగరం, పచ్చికాపల్లం- కొత్తపల్లెమిట్ట రోడ్డును డబుల్ రోడ్డు చేస్తామన్న హామీ నెరవేరలేదు. గత ప్రభుత్వంలో మంజూరైన డిగ్రీ కళాశాలకు ఇంత వరకు నిధులు మంజూరు చేయించలేదు. టీడీపీ నాయకుల దోపిడీలు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయి. 2029లో మా సత్తా ఏందో చూపిస్తాం.

- బి.నారాయణ రెడ్డి, బూత్ కమిటీ నియోజకవర్గ కన్వీనర్

జగన్ హయాంలోనే సంక్షేమం



ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారు. ఆయన తండ్రి వైఎస్ఆర్ పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అందించారు. మరో నాలుగు అడుగులు ముందుకేసి పేదల మోములో చిరునవ్వులు చిందేలా జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అందించారు. కూటమి ప్రభుత్వం ఏ ఒక్క పథకాన్ని పరిపూర్ణంగా చేసిన పాపాన పోలేదు. ఈ ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహావేశాలు రగులుతున్నాయి.

- సుబ్రమణ్యం, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు

మామిడి చెట్ల నరికివేతపై ఫిర్యాదు



నరికివేసిన మామిడి చెట్లు



ఫిర్యాదు చేస్తున్న రైతు సుబ్రమణ్యంయాదవ్

కార్వేటినగరం: లైన్ క్లియరెన్స్ పేరుతో ఓ విద్యుత్ లైన్‌మన్ 30 మామిడి చెట్లను నరికివేసిన సంఘటన మండల పరిధిలోని పాత దేరాకండ్రిగ గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పాతడేరాకండ్రిగ గ్రామానికి చెందిన సుబ్రమణ్యం యాదవ్‌కు చెందిన పొలంలో ఉన్న మామిడి చెట్లను డీఎం పురం విద్యుత్ లైన్‌మన్ క్లియరెన్స్ పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా నరికివేశాడు. 30 మామిడి చెట్లను నరికివేసినట్లు శనివారం రాత్రి కార్వేటినగరం పోలీసులకు రైతు ఫిర్యాదు చేశాడు. దీంతో ఏఎస్ఐ మునికృష్ణ సీఐ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పినట్లు సమాచారం . ఇప్పటికే మామిడి కాయలకు ధరలు లేక, ఇబ్బందులు పడుతున్న తరుణంలో విద్యుత్ సిబ్బంది తనను సంప్రదించకుండా చెట్లను నరికివేయడం దారుణంగా ఉందన్నారు.